ఎమ్మెల్యే అభినందన



నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: కాలనీ సంక్షేమ సంఘాలు ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులకు వారధులుగా పనిచేయాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన చక్రిపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డల పాండు, ప్రధాన కార్యదర్శి అశోక్‌తో పాటు నూతన కార్యవర్గం మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. చక్రిపురం కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానన్నారు. కాలనీవాసులు రాఘవరెడ్డి, కొండారెడ్డి, లాల్‌సింగ్‌, భాస్కర్‌రెడ్డి, ఎర్రయ్య, జగన్మోహన్‌రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు ఆహ్వానం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్కాజిగిరి: 20,21న మల్కాజిగిరిలో జరిగే ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరకు రావాలని దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆహ్వానించారు. మంగళవారం క్యాంప్‌ కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

మౌలాలి: వినాయకనగర్‌ కట్టమైసమ్మ దేవాలయంలో జరిగే బోనాల ఉత్సవాలను రావాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందజేశారు.

జీఓ 282 కాపీలు దహనం

ఉప్పల్‌: రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనివిధానాన్ని తొలగించి 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలని తీసుకొచ్చిన జీఓ నెంబర్‌ 282ను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ.. ఉప్పల్‌ సీఐటీయూ నేతలు జీవో జిరాక్స్‌ కాపీలను మంగళవారం ఉప్పల్‌ కూరగాయల మార్కెట్‌లో దహనం చేశారు. కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలతో 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారన్నారు. అమరవీరుల సాక్షిగా 10 గంటల పనిదినాన్ని తగ్గించేంత వరకు సీఐటీయూ ఆందోళనలు, పోరాటాలు చేస్తాయని స్పష్టం చేశారు. ఆంజనేయులు, వెంకటేష్‌, మురళి మోహన్‌, ఎండీ మస్తాన్‌, దశరథ్‌రాజు అండాలు, నాగమణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మౌలాలి: డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్‌ నేత గద్వాల్‌ వంశీముదిరాజ్‌ అన్నారు. డివిజన్‌లోని షఫీనగర్‌ బస్తీవాసులు స్థానికంగా ఎదుర్కొంటున్న పవర్‌బోర్‌, రోడ్డు, డ్రైనేజీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్‌ నేతలు ఎండీ ఉస్మాన్‌, ఆదినారాయణ, కిరణ్‌, పింటూ, మారుతీప్రసాద్‌, దుర్గేష్‌, స్వామి, శ్రీధర్‌ బస్తీవాసులు విజయలక్ష్మి, వసంత, లావణ్య, లలిత, మణికంఠ, శివ, శ్రీకాంత్‌ తదితరులున్నారు.

వేడుకగా రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

ఉప్పల్‌: ఉప్పల్‌ హిల్స్‌ కాలనీలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా కాలనీ సభ్యులంతా ఐక్యమత్యంగా ఉండి అమ్మవారి కల్యాణం కమనీయంగా జరిపించడం అభినందనీయమన్నారు. కుమారస్వామి, అబ్బయ్య, సుధాకర్‌, నరసింహగౌడ్‌, రామ్‌చందర్‌ పాల్గొన్నారు.

ఉప్పల్‌కు 7 ప్రైమరీ స్కూళ్లు

ఉప్పల్‌: మండలానికి 7 ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లు మంజూరైనట్లు ఉప్పల్‌ మండల విద్యాధికారి రామారావు అన్నారు. పాఠశాలలకు అనువైన స్థలాలను చూస్తున్నామని, అందరికీ ప్రభుత్వ పాఠశాలలు అందించే విధంగా స్కూళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలో ఇప్పటికే 40 ప్రైమరీ స్కూల్స్‌ ఉన్నట్లు ఆయన తెలిపారు. వీటికి అదనంగా మరో 7 స్కూళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఉప్పల్‌ లక్ష్మారెడ్డి కాలనీ, మల్లాపూర్‌ సింగం చెరువు తండా, ఉప్పల్‌ సెవెన్‌ హిల్స్‌ కాలనీ, దేవేందర్‌నగర్‌ కాలనీ, మల్లికార్జుననగర్‌, ఆదర్శ్‌నగర్‌ కాలనీ, ఉప్పల్‌ భగాయత్‌లో మొత్తం 7 స్కూళ్లు మంజూరు చేశారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌తో పేదలకు మేలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌ పరిధిలో నివాసం ఉంటున్న ఇద్దరికి చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌ నుంచి మంజూరైన ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వారికి అందజేశారు. ఖలీల్‌కు రూ.2,50,000, నవ్యకు రూ.1,10,000 మంజూరయ్యాయి. నాయకులు జగదీష్‌గౌడ్‌, వెంకన్న, జనార్దన్‌ పాల్గొన్నారు.

రూ. 45.60 కోట్లతో అభివృద్ధి పనులు

అత్యధికంగా రోడ్ల అభివృద్ధికి రూ. 34.45 కోట్లు

ప్రారంభమైన రా చెరువు సుందరీకరణ పనులు



కొనసాగుతున్న రా చెరువు కట్ట పనులు

బోడుప్పల్‌: నగర పాలక సంస్థ పరిధిలో పలు మౌలిక వసతుల కల్పనకు అధికారులు శ్రీకారం చుట్టారు. రూ 45.60 కోట్లతో ప్రధాన రహదారులు, నాలా పనులు, పార్కుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే రా చెరువు సుందరీకరణ పనులు ప్రారంభమై వేగంగా పనులు జరుగుతున్నాయి. కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, బోడుప్పల్‌ మాజీ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ స్థానిక సమస్యలపై నిధులు కేటాయించాలని సీఎం, హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు సమస్యలపై స్పందించి నిధులు కేటాయించారు.

◆ బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులకు రూ.34.45 కోట్ల నిధులను హెచ్‌ఎండీఏ అధికారులు కేటాయించారు. అంబేడ్కర్‌ విగ్రహం నుంచి చిలుకానగర్‌ వరకు రూ.10.45 కోట్లతో ప్రధాన రహదారిని 100 ఫీట్స్‌ వరకు విస్తరించి, సెంట్రల్‌ లైటింగ్‌, బీటీరోడ్డు పనులు చేపట్టనున్నారు.

◆ బోడుప్పల్‌ మల్లన్న దేవాలయం నుంచి చింతల చెరువు వరకు రూ.14.60 కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. మున్సిపల్‌ కార్యాలయం నుంచి పీర్జాదిగూడ బార్డర్‌ వరకు రూ 4.70 కోట్లు మంజూరు చేశారు.

◆ వీరారెడ్డి నగర్‌ చౌరస్తా నుంచి మల్లాపూర్‌ వరకు రోడ్డు పనులకు రూ 4.70 కోట్లు నిధులు మంజూరు కాగా.. తొలి విడత కింద చిలుకానగర్‌ రోడ్డు, చెంగిచర్ల రోడ్డు పనులకు సంబంధించి టెండర్‌ ప్రక్రియలో ఉంది. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

రూ. 5.20 కోట్లతో చెరువు సుందరీకరణ పనులు..

బోడుప్పల్‌లోని రా చెరువు, అల్మాస్‌ కుంట, సుద్ద కుంట చెరువుల సుందరీకరణకు నిధులు మంజూరయ్యాయి. వాటిలో రా చెరువు సుందరీకరణ పనులకు టెండర్‌ ప్రక్రియ పూర్తయ్యి ప్రస్తుతం పనులు నడుస్తున్నాయి. రా చెరువు కట్ట విస్తరణ, వాకింగ్‌ ట్రాక్‌, గ్రీనరీ, కూర్చునేందుకు బెంచీలు, వీధులు లైట్ల ఏర్పాటు చేయనున్నారు.

రూ. 3.45 కోట్లతో బాక్స్‌ డ్రెయిన్‌ పనులు..

కట్టమైసమ్మ వైన్‌షాపు నుంచి సాయి భవానీ కాలనీ వరకు రూ 3.45 కోట్లతో బాక్స్‌ డ్రెయిన్‌ (నాలా) పనులకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్‌ ప్రక్రియలో ఉంది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

పార్కుల అభివృద్ధికి రూ 2.50 కోట్లు

బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలో మూడు పార్కుల అభివృద్ధికి రూ .2.50 కోట్లు మంజూరు కాగా.. లక్ష్మీనగర్‌ కాలనీలో గ్రేస్‌ మిషన్‌స్కూల్‌ వెనక వైపు స్థలంలో పార్కు అభివృద్ధి, వీరారెడ్డినగర్‌ కాలనీ, చెంగిచర్లలో పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించారు.

ట్రాఫిక్‌ సమస్యకు పరిష్కారం..



బోడుప్పల్‌లోని ప్రధాన రహదారులు విస్తరించడం వల్ల ట్రాఫిక్‌ సమస్య లేకుండా పోతుంది. బోడుప్పల్‌ నగర పాలక సంస్థలో నిధుల కొరత ఉంది. దీంతో మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌తో కలిసి సీఎం, ఇన్‌చార్జ్‌ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. హెచ్‌ఎండీఏ ద్వారా నిధులు మంజూరు చేయించి, వాటిలో రా చెరువు పనులు ప్రారంభమయ్యాయి. మిగతా పనులన్నీ టెండర్‌ ప్రక్రియలో ఉన్నాయి.

– తోటకూర అజయ్‌యాదవ్‌, మాజీ మేయర్‌

త్వరలో రోడ్డు విస్తరణ పనులు..



బోడుప్పల్‌లోని ప్రధాన రహదారులకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్‌ ప్రక్రియలో ఉంది. తొలిదశ కింద చిలుకానగర్‌, చెంగిచర్ల ప్రధాన రహదారుల పనులు చేపడతాం. త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నాం. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– శైలజ, కమిషనర్‌, బోడుప్పల్‌

బ్రెస్ట్‌ కేన్సర్‌ స్క్రీనింగ్‌ మిషన్‌ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌

కాప్రా: కుషాయిగూడ పీహెచ్‌సీ (జమ్మిగడ్డ) ఆసుపత్రిలో మంగళవారం బ్రెస్ట్‌ కేన్సర్‌ స్క్రీనింగ్‌ మిషన్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌, ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ ఆస్పత్రికి మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేన్సర్‌ వ్యాధి భారిన పడిన రోగుల బాధలు వర్ణనాతీతమన్నారు. కేన్సర్‌ మహమ్మారిని గుర్తించలేక ఎంతో మంది ప్రజలు చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్‌ విషయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌, సుభాష్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌, పియూష్‌ మిట్టల్‌, శ్రీనివాస్‌రెడ్డి, మహితా డైరెక్టర్‌ రమేష్‌, శేఖర్‌రెడ్డి, డాక్టర్‌ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఉప్పల్‌: ఉప్పల్‌ కల్యాణపురి విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్‌ నర్సింగరావు తెలిపారు. వేంకటేశ్వరస్వామి టెంపుల్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

మేడిపల్లి: 11 కేవీ ప్రగతినగర్‌ ఫీడర్‌ పరిధిలో పీఎంఐ వర్క్స్‌ పనుల మరమ్మతుల కారణంగా 33/11 పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్‌ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ వరంగల్‌ హైవే ఫీడర్‌ పరిధిలో పీఎంఐ వర్క్స్‌ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు విద్యుతత్‌ సరఫరా ఉండదని, విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళితుల భూముల్లో ల్యాండ్‌ పూలింగ్‌ చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

బోడుప్పల్‌: బోడుప్పల్‌లోని దళితుల భూములను ల్యాండ్‌ పూలింగ్‌ కింద చేపట్టాలని మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ మనూ చౌదరికి మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 63/2 నుంచి 63/25లో 234 ఎకరాల్లో గతంలో ల్యాండ్‌ పూలింగ్‌ చేపట్టారన్నారు. కొన్ని కారణాల వల్ల మధ్యలో ఆగిపోయిందన్నారు. తిరిగి ల్యాండ్‌ పూలింగ్‌ చేపట్టి జీఓ ప్రకారం ఎకరానికి 600 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. దీనికి కలెక్టర్‌ కూడా సానుకూలంగా స్పందించి 15 రోజుల్లో హామీ పత్రాలను అందజేస్తామన్నారన్నారు. మాజీ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌, బోడుప్పల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, దళిత నేతలు కృష్ణ, ఉపేందర్‌, శ్రీనివాస్‌, యాదగిరి, కుమార్‌, గిరి, మల్లేష్‌, విజయ్‌, జంగయ్య తదితరులున్నారు.

సందడిగా గోరింటాకు వేడుక



గోరింటాకు చూపుతున్న మహిళలు

కుషాయిగూడ: వాసవి, వనిత క్లబ్‌ కాప్రా ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌బీకాలనీలో గోరింటాకు వేడుకను ఘనంగా నిర్వహించారు. క్లబ్‌ అధ్యక్షురాలు నేర్లకంటి ఉమా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో యూట్యూబర్స్‌ సరిత, సురేఖ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగ గోరింటాకు సేకరించడం, సంప్రదాయబద్ధంగా రోటిలో గోరింటాకు నూరి, ఒకరి చేతికి మరొకరు గోరింటాకు పెట్టుకోవడం పండుగ వాతవరణాన్ని తలపించింది. ఈ వేడుకలో పాలుపంచుకున్న మహిళలకు పలు వినోదాత్మక పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వేడుకలో క్లబ్‌ సెక్రటరీ యాంసేని రజిత, ఎ. కళ్యాణి, సముద్రాల లక్ష్మీ తదితరులు పాలుపంచుకున్నారు.

నకిలీపత్రాలతో ప్లాట్ల విక్రయం..

వ్యక్తి అరెస్ట్‌

మల్లాపూర్‌: భూమి లింక్‌ డాక్యుమెంట్స్‌, బోడుప్పల్‌ భూమికి చెందిన డాక్యుమెంట్లను చూపిస్తూ ఫోర్జరీ చేసి ఇతరులకు భూమిని అమ్మిన కేసులో నాచారం పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్‌ చేశారు. ఎస్సై వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ వరంగల్‌కు చెందిన భూక్యా శ్రావణ్‌కుమార్‌ (30), మల్లాపూర్‌ గోకుల్‌నగర్‌ చెందిన ప్లాట్‌ నెంబర్‌ 300, మొత్తం 583 గజాల స్థలాన్ని లింకు డాక్యుమెంట్స్‌గా బోడుప్పల్‌ భూమికి సంబంధించిన భూమి లింకు డాకుమెంట్లను చూపిస్తూ.. ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లను తయారుచేసి, సేల్‌డీడ్‌లు చేసి ఇతరులకు విక్రయించాడు. పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంగళవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

బోడుప్పల్‌: అరుణాచల పుణ్యక్షేత్ర దర్శనానికి చెంగిచర్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం కవిత వెల్లడించారు. మంగళవారం చెంగిచర్లలో ఆమె మాట్లాడుతూ.. అరుణాచలం పుణ్యక్షేత్రానికి ఈనెల 11న ప్రత్యేక సూపర్‌ లగ్జరీ బస్సును కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అరాంఘర్‌ మీదుగా కాణిపాకం విఘ్నేశ్వర దేవాలయం, వెల్లూరు గోల్డెన్‌ టెంపుల్‌, అరుణాచలం ట్రిప్పు ఉంటుందన్నారు. ఈ ప్రయాణానికి పెద్దలకు రూ. 3900, చిన్నపిల్లలకు రూ. 3300లు నిర్ణయించామన్నారు. వివరాలకు 789308843, 9063413318.

విద్యార్థులు ఖగోళ శాస్త్రవేత్తలుగా ఎదగాలి



శ్రీనివాస్‌కు మెమెంటోను అందజేస్తున్న రూపారెడ్డి

బోడుప్పల్‌: నేటితరం విద్యార్థులు ఖగోళ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజినీర్లుగా రాణించేందుకు కృషి చేయాలని ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఐఎస్‌ఆర్‌ఓ హెడ్‌, స్టూడెంట్‌ అండ్‌ పబ్లిక్‌ అవుట్‌రీచ్‌ డాక్టర్‌. ఆర్‌. శ్రీనివాస్‌ అన్నారు. బోడుప్పల్‌ అకడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో మంగళవారం జరిగిన నేషనల్‌ స్పేస్‌ డే సెలబ్రేషన్స్‌ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతరిక్షంలోకి అనేక శాటిలైట్స్‌, పంపించడం వల్ల మానవుడి నిత్య జీవితంలో సాంకేతికతను వినియోగించుకోవడానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. చంద్రయాన్‌ 1,2,3 గురించి విద్యార్థులకు పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. భవిష్యత్తులో గగన్‌యాన్‌ ప్రయోగించేలా పరిశోధన ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. రీజనల్‌ డైరెక్టర్‌ రూపారెడ్డి, సీనియర్‌ ప్రిన్సిపాల్‌ సునీత, ప్రిన్సిపాల్‌ నీలిమాదేవి, వైస్‌ ప్రిన్సిపాల్‌ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి !



మల్లాపూర్‌: మల్లాపూర్‌ వార్డు కార్యాలయం ఎదురు గల్లీలో గత 15 రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ నుంచి పొంగిపొర్లుతుంది. జలమండలి నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడంతో నిత్యం డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీంతో దోమలు, ఈగల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. జలమండలి మేనేజర్‌ 9154706344.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సింగం చెరువుతండాలో పాలాభిషేకం చేస్తున్న అనిల్‌కుమార్‌

మల్లాపూర్‌: ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని గ్రేటర్‌ కాంగ్రెస్‌ సీనియర్‌ నేత నెమలి అనిల్‌కుమార్‌ అన్నారు. మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సింగం చెరువు తండాకు ప్రాథమిక పాఠశాల మంజూరైనందుకు మంగళవారం ఎస్టీసెల్‌ అధ్యక్షులు మహేష్‌నాయక్‌ ఆధ్వర్యంలో ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్‌ నేతలు సుధాకర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌, సునీల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజేష్‌, తండావాసులు బాలు నాయక్‌, నరేష్‌, వినోద్‌, శేఖర్‌, పవన్‌, వెంకట్‌నాయక్‌ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



దేవేందర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్‌: నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయనున్నట్లు ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్‌ డివిజన్‌ దేవేందర్‌నగర్‌ కాలనీలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే ఉప్పల్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు, ఇతర అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. దేవేందర్‌నగర్‌లో అన్ని సమస్యలేనని అడుగడుగునా నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్య, స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని, తాగునీటి సమస్య, కమ్యూనిటీహాల్‌ నిర్మాణం తదితర సమస్యలను ఎమెల్యే గుర్తించారు. వాటిని దశలవారీగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. స్థానికులు, బీఆర్‌ఆర్‌ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సత్కారం



కార్పొరేటర్‌ దంపతులను సత్కరిస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్‌: రాఘవేంద్రనగర్‌ కాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్‌ను వేయించి రూ. 35 లక్షలతో సీసీరోడ్డు వేసినందుకు కృతజ్ఞతగా మంగళవారం కాలనీవాసులు నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. నాచారం డివిజన్‌లో 9 ఏళ్లుగా రూ.100 కోట్ల కంటే నిధులు మంజూరు చేయించి నాచారం డివిజన్‌ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కాలనీవాసులు ప్రభావతి, శ్రీనివాస్‌, ప్రభాకర్‌రెడ్డి, సిరాజుద్దీన్‌, రాజ్‌పాల్‌రెడ్డి, నటరాజ్‌, మొయిన్‌, బ్రహ్మయ్య, రాజు, కొండల్‌చారి, సంతోష్‌, హమీద్‌, శ్రీనివాస్‌, జహంగీర్‌ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్థానిక నేతలు



చర్లపల్లిలో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

జననేతకు ఘన నివాళి

ఘనంగా వైఎస్‌ఆర్‌ జయంతి వేడుకలు

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో దివంగత మహానేత డాక్టర్‌ వైఎస్‌.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన విగ్రహం, చిత్రపటాలకు వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్‌ మహానేతగా ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ప్రతి పేదవాడికి ఆయన అందించిన సంక్షేమ ఫలాలు అందాయని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం.



వైఎస్‌ఆర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి



ఆర్‌కేపురంలో జగదీశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో..



నేరెడ్‌మెట్‌ చౌరస్తాలో..